# ఏకాత్మతత్త్వమే అద్వైతము

**తరువతరువ బుట్టు తరువున ననలంబు**
**తరువతరువ బుట్టు దధిని ఘృతము**
**తరువతరువ బుట్టు తనువున తత్త్వంబు**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

ప్రేమస్వరూపులారా!

చెట్టుకొమ్మలు ఒక దానితో ఒకటి అనేక పర్యాయములు రాపిడి జరిగినప్పుడు అందునుండి అగ్ని ఆవిర్భవిస్తుంది. చిలుకుతూ రాగా పెరుగునుండి వెన్న ప్రారంభమవుతుంది. విచారిస్తూ రాగా తనయందే దివ్యత్వము ఆవిర్భవిస్తుంది. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' దేనికైనను మానవప్రయత్నము అత్యవసరము.

**శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాధ్యానం విశిష్యతే**
**ధ్యానాత్కర్మఫలత్యాగ త్యాగాశ్శాన్తిరనన్తరం.**

నడవటానికిగానీ, మాట్లాడుటకుగానీ, తినటానికిగానీ, వ్రాయుటకుగానీ, చదవటానికిగానీ అన్నీకూడా అభ్యాసముచేతనే మనకు లభ్యమవుతూ ఉంటాయి. అదే విధముగా దివ్యత్వము పొందాలనుకున్నప్పుడు దానికికూడా తగిన ప్రయత్నం చేయాలి.

**సమాజ సంక్షేమముకొరకు ఎట్టి కర్మలు ఆచరించినా అవి భగవత్కర్మలుగా రూపొందుతాయి**

తట్టలో పెట్టుకున్న పదార్థము పొట్టలో చేరాలంటే చేతికి, నోటికి పని పెట్టాలికదా! అట్లుగాక తట్టలోనున్న పదార్థము 'పంచభక్ష్య పదార్థము', 'పంచభక్ష్య పదార్థము' అని నూరు పర్యాయములు చెప్పినా మన పొట్టనిండదు. అదే విధముగా కేవలము నామము రామ, కృష్ణా,

srisathyasaivachanamrutam

గోవిందా అని ఉచ్చరించినంతనే చాలదు. దానికి తగిన రీతిగా క్రియారూపములో సమాజసేవ చేయాలి. సమాజ సంక్షేమమును హృదయమునందుంచుకొని ఎట్టి కర్మలు ఆచరించినా అవి భగవత్కర్మలుగా రూపొందుతాయి. కానీ, ఈనాటి మానవుడు ఆ విధమైన ప్రయత్నములలో పాల్గొనక కేవలం అన్నీ సులభంగా లభ్యము కావాలని ఆశిస్తున్నాడు. 'క్షీరే సర్పే, తిలేతైలం, పుష్పేగంధం, ఫలంరసం, కాష్టంఅగ్ని, ఏకం పరాత్మా బహుదేహవర్తి'. పాలనుండి వెన్న ఏ విధంగా బయటపడుతున్నదో, నువ్వులనుండి నూనె ఏవిధంగా ఆవిర్భవిస్తున్నదో, పూవునుండి పరిమళము ఏవిధముగా లభ్యమవుతున్నదో, ఫలమునుండి మధురరసము ఏవిధముగా ఆవిర్భవిస్తున్నదో, కట్టెనుండి నిప్పు ఏ విధంగా ఉద్భవిస్తున్నదో అదే విధంగా ప్రతి మానవునినుండి దివ్యత్వము ఆత్మస్వరూపమై ఆవిర్భవిస్తున్నది. దీనినే వేదాంతము 'ఏకంసత్ విప్రాః బహుధావదంతి' ఉన్నది ఒక్కటే, అది అనేకంగా కనిపిస్తున్నది అని వివరించింది. కాని ఈనాటి విద్యార్థులు, యువకులు అనేక అపోహలకు చోటిచ్చి సత్యనిత్యమైన దివ్యత్వమును విస్మరించి అసత్యమే సత్యముగా భావించి కాలమును, కర్మను వ్యర్థం చేసుకోటమే కాకుండా, కాయమునుకూడా నిరర్థకము గావించుకుంటున్నారు.

**అన్నిటికి మూలాధారమైన తత్త్వము ఒక్కటే!**

రూపములు భిన్నభిన్నంగా మనకు గోచరించవచ్చు. రూపమునకు తగిన పేర్లుకూడా మనం పెట్టుకోవచ్చు. ఒక్కొక్క పదార్థమునకు ఒక్కొక్క అనుభూతి మనము అనుభవించవచ్చు. కానీ, అన్నింటికి మూలాధారమైన తత్త్వము ఒక్కటే అనే సత్యము నిరూపిస్తూపోయినవాడే శంకరులవారు. అదే అద్వైత సిద్ధాంతము. ఒక మామిడి విత్తనము నాటాము. కొంతకాలమునకు అది వృక్షముగా రూపొందినది. వృక్షములో శాఖోపశాఖలు అభివృద్ధి అయినాయి. వృక్షమునందు అనేక వందల ఆకులున్నాయి. అనేక వేల పుష్పములుంటున్నాయి. అనేక వందల కాయలుంటున్నాయి. కానీ కాయలకు, పుష్పములకు సంబంధములేనట్లు కనిపిస్తుంది. ఆకులకు, కొమ్మలకు ఏ విధమైన సంబంధము లేనట్లుగా కనిపిస్తుంది. వాటి ఫలితములు భిన్నభిన్నముగా మానవునికి అందిస్తున్నాయి. కాయలు కోసి ఊరగాయ వేసుకోవచ్చు. ఆకులు తీసి తోరణాలు



sri sathyasai vachanamrutam

కట్టుకోవచ్చు. ఎండిపోయిన కొమ్మలు వంటచెఱకు మాదిరి ఉపయోగపెట్టుకోవచ్చును. ఫలములు భుజించవచ్చును. ఫలితములుకూడా భిన్నభిన్నముగా ఉంటున్నాయి. కానీ 'బీజంమాం, సర్వభూతానాం' అన్నట్లు, ఈ కొమ్మలకు, రెమ్మలకు, ఆకులకు, ఫలములకు అన్నింటికి ఆ విత్తనమే మూలాధారము. విత్తనమే లేక వృక్షమే లేదు. వృక్షములేక కొమ్మలులేవు. కొమ్మలు లేక కాయలులేవు. ఈ విధముగా ఒకదానిపైనొకటి ఆధారపడి అన్నింటియొక్క ఏకత్వము నిరూపించేదే అద్వైతము. దృశ్యకల్పితమైన జగత్తు భిన్నభిన్నంగా గోచరించవచ్చును. కానీ, విచారణ చేసినప్పుడు మూలాధారమైన తత్త్వము ఒక్కటేయని గుర్తింపచేస్తుంది.

**విద్య జ్ఞానముకొరకు, కృషి కూటికొరకు**

నిన్న చెప్పాను. శంకరులవారు కాలడిలో పుట్టి తండ్రి మరణించగానే తల్లిని ప్రార్థించి ఆమె అనుమతిచేత సన్యాసము స్వీకరించి గోవిందుడు అనే గురువును సమీపించాడు, వేదశాస్త్రయితిహాసపురాణ పఠనకోసం. ఈ గోవిందుని గురువు గౌడపాదుడు. శంకరులు 14 సం॥లు పూర్తి కాకపూర్వమే నాలుగువేదములు, ఆరు శాస్త్రములు పఠించి తర్కవ్యాకరణమీమాంస యిలాంటి శాస్త్రములను క్షుణ్ణముగా నేర్చుకున్నాడు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. శ్రద్ధ కలిగినవానికి కాలము ఏమాత్రము అడ్డురాదు. అన్నింటికి కాలమే ప్రధానము, కాలమే ప్రమాణము. 'కాలాయ నమః, కాల కాలాయ నమః, కాల దర్పదమనాయ నమః, కాలాతీతాయ నమః, కాల స్వరూపాయ నమః' అంతా కాలమే! పుట్టిన బిడ్డ పెరిగి 'వృద్ధుడు' కావాలంటే కాలమే ప్రమాణము. పుట్టగానే శిశువు అంటున్నాము, 10 సం॥లకు పిల్లవాడు అంటున్నాము. 30 సం॥లకు యువకుడు అంటున్నాము. 75 సం॥లకు వృద్ధుడు అంటున్నాము. ఈ వృద్ధుడు, యవకుడు, పిల్లవాడు, శిశువు ఒక్కడే! కాలానుగుణముగా వచ్చిన రూపనామములే, యీ భిన్నదశలు. శంకరులవారికి శ్రద్ధ అధికంగా ఉండటంచేత 14 సం॥లలోపలే అన్ని విధములైన శాస్త్రములను అధ్యయనం చేయడం పూర్తి చేసుకున్నాడు. ఒకనాడు శంకరుల ప్రభావమును, శక్తిసామర్థ్యములను గుర్తించాలని సంకల్పించి గోవిందుడు అతనితో

srisathyasaivachanamrutam

వాదోపవాదములకు పూనుకున్నాడు. గురువుతో వాదన చేయుటకు పూనుకున్న సమయమందు, అతి వినయవిధేయతలతో ఉండినాడు, శంకరుడు. 'విద్యావినయసంపన్నే'. అనగా విద్యార్థికి వినయమే భూషణము. వినయమే లేక విద్య మనకు ప్రాప్తించదు. గురువుతో వాదోపవాదమునకు పూనుకునే పూర్వము గురువుకు నమస్కరించి 'మీతో వాదము చేయుటకు అనుజ్ఞ యివ్వండి', అని ప్రార్థించాడు. గురువు ఆజ్ఞ తీసుకొని గురువుతోనే వాదన ప్రారంభించాడు. ఈ వాదనలో అత్యంత అద్భుతంగా గురువు వాక్యములను ఖండిస్తూ శాస్త్రమునకు విరుద్ధముకాకుండా వేదములకు అడ్డు తగలకుండా, భౌతికమైన ప్రాకృత మార్గములకు ఏవిధమైన భిన్నము కల్గకుండా నివృత్తిమార్గములో ప్రవృత్తి లక్షణమును చక్కగా ప్రబోధిస్తూ వచ్చాడు. పూర్వము గొప్ప గొప్ప పండితులు ఉండేవారు. కానీ విద్య కేవలము జ్ఞానముకోసమనే సత్యమును వారు విస్మరించారు. ఈనాటికికూడా విద్యార్థులు విద్య కూటికోసము యేర్పడినదిగా భావిస్తున్నారు. కాదు, యిది చాలా పొరపాటు. 'కృషి కూటికోసం, విద్య జ్ఞానముకోసం'. ఈ సత్యమును గుర్తించిన శంకరులు ఈ పండితులను ఏవిధంగా మార్గములో పెట్టాలి, వీరింత గొప్ప వారైనప్పటికి, కావలిసినంత విద్య నేర్చినప్పటికి, దానిని దుర్వినియోగం చేస్తున్నారు, నిరుపయోగం చేస్తున్నారు. వీరిని సరైన మార్గములో ప్రవేశపెట్టాలని అనేక శ్రమలు పడ్డాడు.

**నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై**
**హద్దునుపద్దు లేక వ్యయమందగజేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారపోసి అరవిందదళాక్షుని విస్మరించి యే**
**పెద్దసుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

**పుస్తకముల్ పఠించితిని పూర్తిగ జూచితి సర్వశాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని యీ**
**ప్రస్తుత విద్యలన్నియును పాడగు విద్యలె చూడు మానవా!**

srisathyasaivahini

అని శంకరులవారు బాధపడ్డారు. ఈ దృశ్యమును చూచాడు గోవిందుడు. గోవిందుని గురువైన గౌడపాదుడుకూడా చాలా విచారించాడు. ఈ లేత వయస్సునందే ఇంతటి పవిత్రమైన భావములు శంకరునిలో ప్రవేశించటము చాలా అద్భుతము. 'ఈనాడు ప్రపంచములోనున్న అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములకు వేదశాస్త్రయితిహాస పురాణములలోని మూలాధారమైన సత్యమును విస్మరించటమేనని నిరూపించినవాడు శంకరుడు', అని వారిలో వారు నిర్ణయించుకున్నారు. శంకరులను పిలచి 'నాయనా! నీవు యిక యిక్కడ నుండనక్కరలేదు. రేపటి దినమే నీవు కాశీకి బయలుదేరు. కాశిలోని పండితులకు ఈ అద్వైతసిద్ధాంతమును బోధించి జగద్వ్యాప్తి గావించాలి. యిది నీకే తగిన హక్కు, మరొకరికి లేద'న్నారు.

**అంత్యకాలములో మానవుని కాపాడేటువంటిది దైవచింతన ఒక్కటే!**

అదే విధంగా ఈనాటి అన్యాయ అక్రమ అనాచారములను రూపుమాపుటకు విద్యార్థులే తగిన సమర్థులు అనే సత్యాన్ని ఈనాటి విద్యార్థులు గుర్తించాలి. గురువు ఆజ్ఞ తీసుకొని శంకరులు కాశీకి బయలుదేరాడు. ఆనాటు ట్రైన్సు, బస్సులులేవు. కాలినడక. 16 సంוּలు వయస్సులో తన శిష్యులను తీసుకొని బయలుదేరాడు. దారిలోపల ఒక పండితుడు ఒక చెట్టుక్రింద కూర్చుని డుకృఙ్‌కరణే డుకృఙ్‌కరణే అని పాణిని వ్యాకరణము వల్లిస్తున్నాడు. అక్కడ ప్రారంభించాడు భజగోవిందం.

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఙ్‌కరణే.**

'ఓ మూర్ఖుడా! గ్రామరుతో నీవు ఏమి సంపాదిస్తావు? అంత్యకాలములో యీ గ్రామరు నిన్ను రక్షిస్తుందా? లేదు. భగవంతుని స్మరించు. అంత్యములో మిత్రులుగానీ, బంధువులుగానీ, ఏ విధమైన ధనకనక వస్తువాహనాదులు నీ వెంటరావు. నీ వెంట, జంట, యింట, ఉండి కాపాడేటువంటిది దైవచింతన ఒక్కటే! గోవిందుని స్మరించు', అని బోధించాడు. అక్కడ అతనిని సమాధాన పరచి, అతనికి భగవంతుని చింతకావాలి అని బోధించి ముందుకు సాగిపోయాడు.

## ధనదాహము విడిచిపెట్టండి, దైవదాహము పెంచుకోండి!

శంకరులవారి ప్రబోధలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. ఒకనాడు పండితులందరూ ఒక పెద్ద సమావేశము ఏర్పాటుచేశారు. పండితులందరు పెద్ద పెద్ద కంకణాలు ధరించి పెద్ద పెద్ద శాలువలు కప్పుకొని రుద్రాక్షమాలలు వేసుకొని ఠీవిగా వచ్చి సభలో కూర్చున్నారు. ఆడంబరమునకు ఏవిధమైన కొరతలేకుండా ఉంటున్నాది, ఆ సభలో. శంకరులవారు నిరాండంబరముగా వచ్చారు. మోకాలువరకు చిన్న పంచ కట్టుకున్నారు. ఒక చిన్న టవలు కప్పుకొని ప్రవేశించాడు. పండితులందరు హాస్యాస్పదముగా చూస్తూ వచ్చారు. 'ఒక్క రుద్రాక్షమాల లేదు. పండితుడు ఎంత గంభీరముగా ఉంటుండాలి! యితను ఏమి చెప్పగలడ'ని తమలో తాము చింతిస్తూ వచ్చారు. అందరూ 'శంకరులవారు! మీరు చాలా గొప్పవారట! వేదశాస్త్ర యితిహాస పురాణములు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు సర్వస్వము తెలిసినవారట!. వ్యాకరణము, మీమాంస తెలిసినవారు. అద్వైతసిద్ధాంతములో ఆణిముత్యమువంటివారు'. అంటూ ఎగతాళి చేయడం మొదలు పెట్టారు. అప్పుడు శంకరులవారు చేతులు జోడించి

**వలదు వలదు ధనదాహము నరుడా**
**మంచిబుద్ధితో మానుము కోర్కెలు**
**కర్మఫలితమే కదరా విత్తము**
**కలిగినంతలో కనరా తృప్తిని ॥భజ॥**

అంటూ ఈ దాహము చాలా పొరపాటైనద'ని వారిని మందలిస్తూ వచ్చాడు. మనము చేసిన కర్మలఫలితమే విత్తము. యద్భావం తద్భవతి. మన శ్రమకు లభించినదే ధనము. 'రెక్కలాడితే డొక్కలాడతాయి' అన్నట్లుగా రెండు చేతులతో పనిచేస్తే నీ పొట్టనిండదా? భగవంతుడు ఎంత కరుణామయుడు! రెండు చేతులనిచ్చాడు, ఒక్క పొట్టనిచ్చాడు. ఒక్క పొట్ట నింపుకోటానికి రెండు చేతులు చాలవా? ఈనాడు నీవు రెండు చేతులతో పని చేయటంలేదు. కనుక నీ పొట్ట నిండటంలేదు. సోమరత్వానికి ఏమాత్రము అవకాశములేదు. ధన దాహము మానండి, దైవ దాహము పెంచుకోండి! ధర్మ దాహమును పెంచుకోండి!' అని

srisathyasaivachanamrutam

ఈ విధంగా ఒక గొప్ప ఉపన్యాసము ప్రారంభించాడు. అక్కడ చేరిన పండితులే కాక వారి శిష్యులుకూడను చాలా ఆశ్చర్యపడుతూ వచ్చారు. 'పిట్టకొంచము, కూతఘనము'. మనిషి చిన్నగా ఉన్నాడు. నీతులు చూస్తే చాలా గొప్పగా ఉంటున్నాయి. నీతులేకాదు, అతని ప్రవర్తనకూడా ఎంతో గొప్పగా ఉంటున్నాది. ఇదియే మహనీయులయొక్క గుణము. 'మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనమ్' అని మెచ్చుకున్నారు. దీనినే the proper study of mankind is man అన్నారు. మనస్సు, వాక్కు, కర్మల పవిత్రత కలగాలి. మనస్సు పరిశుద్ధముగా ఉండాలి. ఆ పరిశుద్ధ మనస్సునుండి వచ్చే వాక్కులు పరిశుద్ధమైనవిగా ఉండాలి. సత్యవాక్కుకు తగినట్లుగా సత్ప్రవర్తన చేరాలి. దీనినే త్రికరణశుద్ధి అని చెబుతూ వచ్చారు వేదములో. త్రికరణ శుద్ధి శంకరులవారియందు ప్రత్యక్షముగా కొట్టవచ్చినట్లు కనిపించింది. అనేకమంది ప్రశ్నలు వేశారు, 'అద్వైతమంటే ఏమిటి?' అని. 'అద్వైతమంటే ఏకత్వమే! అదే నిజమైన అద్వైతము. 'ఏకాత్మతత్త్వమే అద్వైతము' అని బదులు చెప్పాడు. 'అద్వైతదర్శనం జ్ఞానం'. అదే నిజమైన అద్వైతము.

**మూలాధారతత్త్వము ఒక్కటే!**

జ్ఞానం అంటే ఏమిటి? భౌతికజ్ఞానమా? ప్రపంచజ్ఞానమా? ప్రాకృతజ్ఞానమా? ఆధ్యాత్మికజ్ఞానమా? ఏ జ్ఞానము? ఆధ్యాత్మిక జ్ఞానము, ఆత్మజ్ఞానము. ఇదే మూలాధారమైనది. ఇట్టి మూలాధారతత్త్వమును ఏ పండితుడు గుర్తించుటకు ప్రయత్నించటంలేదు. నిన్న చెప్పాను VC కూడా చెప్పాడు. మట్టినుండి కుండలు వచ్చాయి. కుండలో మట్టి ఉందిగానీ మట్టిలో కుండలేదు. చక్కగా గుర్తించాలి. మట్టినుండి అనేక కుండలు ఏర్పడుతూ వచ్చాయి. 'సువర్ణమేకం బహుభూషణాని' బంగారం ఒక్కటైనా భూషణాలు అనేకంగా వస్తున్నాయి. అదే విధంగా మూలాధారతత్త్వము ఒక్కటే! రూపనామములు భిన్నంగా ఉంటున్నాయి. కంకణము అంటున్నారు, యిక్కడ పెట్టుకుంటే! చెవులపోగులంటున్నారు, యిక్కడ పెట్టుకుంటే! వేలుకి పెట్టుకుంటే ఉంగరమంటున్నారు. మెడలో వేసుకుంటే దండ అంటున్నారు. నడుముకు పెట్టుకుంటే వడ్డాణమంటున్నారు. రూపనామములు వేరువేరుగానీ బంగారము ఒక్కటే! దీనినే అర్థము వచ్చేటట్లుగా ఆ సభలో

sri sathyasaivachanamrutam

అందరికి బోధిస్తూవచ్చాడు, శంకరులు. ఏమిటి భేదము! రూపములో భేదమా, నామములో భేదమా, ప్రవర్తనలో భేదమా? కాదు కాదు. అన్నింటికి హృదయమే మూలాధారము. కాబట్టి, ప్రతి ఒక్కరు హృదయమును అనుసరించండి. దానినే conscience అన్నారు. శంకరులవారు చాలా సులభమైన మార్గము ప్రబోధిస్తూవచ్చారు.

**శృంగారములు వేరు, బంగారమొక్కటే**
**పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే**
**జీవ జాతులు వేరు, జీవుండు ఒక్కడే**
**పూలజాతులు వేరు, పూజ ఒక్కటే**
**దర్శనంబులు వేరు, దైవమొక్కడే**
**తెలియలేకను మానవుల్ దెలివితప్పి**
**బ్రతుకుకోసము బహుబంధబద్ధులైరి**

ఈ విధముగా మీరు లోతుకు దిగిచూస్తే అంతా ఒక్కటే, ఒక్కటే! ఇంతమంది ప్రజలిక్కడ కూర్చున్నారు. అనేక రూపనామములతో ఉంటున్నారు. అనేక భావములతో ఉంటున్నారు. అనేక ప్రవర్తనలతో ఉంటున్నారు. కాని అందరియందు పంచభూతములు ఒక్కటే! నీలో, నాలో, వానిలో, వీనిలో అందరిలో పంచభూతములు ఒక్కటే!

## బ్రహ్మ అనగా బృహత్స్వరూపము

ఈ పంచభూతములతత్త్వమే పరమతత్త్వము. అది అందరియందు ఉంటున్నది. నీవు, వాడు, వీడు, అందరూ ఆత్మస్వరూపులే! వీరందరు బ్రహ్మస్వరూపులే! అందువల్లనే భగవద్గీతయందుగానీ ఉపనిషత్తులందుగానీ 'తత్-త్వం అసి' చెప్పబడింది. 'అహం బ్రహ్మాస్మి' నేనే బ్రహ్మ. యిదికాదని ఎవరు చెప్పగలరు? బ్రహ్మ అంటే ఏమిటి? బృహద్ స్వరూపము. వ్యాపించే శక్తి కలిగినది. మానవునియందున్న భావములు వ్యాపించిపోతున్నాయి. మీరు యిక్కడ ఉంటున్నారు. కానీ మీ బుద్ధి మద్రాసులో, బొంబాయిలో పోయి తిరుగుతున్నాది. ఎంత విశాలమైనది! ఒక్క క్షణములో వెళ్లిపోయింది, ఢిల్లీ! కాబట్టి బృహత్స్వరూపకముగా ఉంటున్నాది. మనము దానిని పోషించుకోటంలేదు. దానిని మనం బలపరచుకోటంలేదు.



sri sathyasai vachanamrutam

దానిలో ఆశలు, దురాశలు ప్రారంభమవుతూవచ్చాయి. ఒక రైతు ఉండేవాడు. ఆ రైతుకు కొంత భూమి ఉంటుండేది. తరువాత కొన్నాళ్లకు అతడు ఎక్కువ భూమి సాగుచేసుకొని 'జమిందారు' అని పిలిపించుకోవాలని ఆశపడ్డాడు. కొంతమంది మిత్రులు చేరి, 'భూమిని కొందామనుకుంటున్నావు. అంత భూమి కొనటానికి నీ దగ్గర డబ్బులేదు కదా! మేము ఒక యుక్తిని చెబుతాం, నీకు కావలసినంత భూమి చిక్కుతుంది' అన్నారు. ఆశకలిగినవాడు కనుక రెండు చెవులుకాదు, యిరవై చెవులు పెట్టి విన్నాడు.

**పొద్దుపోక ఊరివారి సుద్దులంటే మీరు సిద్ధమౌదురే శ్రద్ధతోడ**
**ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటల్ చెప్పునప్పుడు**
**ఒద్దికగనుండరేల ఓ చెవులా? మీరు ఒద్దికగనుండరేల ఓ చెవులా?**

మంచిమాటలు వినాలంటే చెవులు ఒద్దికగా నుండవు. చెడ్డమాటలు వినాలంటే సిద్ధముగా ఉంటాయి. వేలకొద్ది చెవులు తెచ్చి పెట్టుకుంటారు. అప్పుడు శ్రద్ధగా విన్నాడు ఈ రైతు. 'చెప్పండి, తప్పక చేస్తాను' అన్నాడు. 'ఈ ప్రాంతము వదలి మీరు హిమాలయము వెళ్లండి, కావలసినంత భూమి చిక్కుతుంది' అన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాజును కలిసాడు. 'సార్! నాకు భూమి కావాల'న్నాడు. 'నాయనా! ఎంత దూరమునుంచి వచ్చావు?' అన్నాడు. 'ఆంధ్రదేశమునుండి' అని చెప్పాడు. ఎంత దూరముంటున్నాది! 'తప్పక యిస్తాను. ఒక దగ్గర నీవు ప్రారంభించు. అక్కడనుండి తెల్లవారి 7 గం॥ల మొదలు ప్రయాణము చేసి రాత్రి తిరిగి 7 గం॥ల లోపల ఎంత దూరము నడచి వస్తావో ఆ మధ్యలోని భూమినంతా నీకే యిస్తాను' అన్నాడు. 'ఒక స్థానములో బయలుదేరి ఎంత దూరము నీవు చుట్టుతావో అంత స్థలము యిస్తాన'న్నాడు. సంతోషించాడు. 'టిఫిన్ తింటే భారమైపోతుంది, నడచటానికి వీలు కాదు, బాగా పరుగెత్తవచ్చు యింకా భూమి ఎక్కువగా సంపాయించుకోవచ్చు'ననుకున్నాడు. ఏమీ తీసుకోలేదు. పాపం! ఆశ ఎంత మోసానికి గురి చేస్తుంది! పరుగెత్తాడు, పరుగెత్తాడు. ఒక నూరు ఎకరాలు వచ్చేవరకు పరుగెత్తాడు. తిరిగి వస్తూ తాను ప్రారంభించిన స్థానానికి ఒక యిరవై అడుగుల దూరంలో ఉంటున్నాడు. పాపం దాహమైంది. గుండె పట్టింది. క్రింద కూలాడు. ప్రాణం వదిలాడు. అక్కడ

srisathyasaivachanamrutam

గుమికూడిన ప్రజలందరు చేరి 'రాజా! పాపం ఎంతో ఆశగా వచ్చాడు. ఎన్నో వందల ఎకరాలు సంపాయించుకోవాలని వచ్చాడు. కానీ అతనికి యిప్పుడు ఆరడుగులు మాత్రము చాల'న్నారు. ఇంత దురాశకు పోవటంచేత కట్టకడపటికి ఎంత దుర్గతి పట్టిపోయింది! మన ఆశలకు ఒక పరిమితము ఉంటుండాలి. పరిమితము లేకుండాపోతే ప్రమాదము సంభవిస్తుంది. కనుకనే శంకరులవారు అందరికి బోధించాడు: 'వలదు వలదు ధనదాహము నరుడా', విద్యార్థులు పాసైన తక్షణమే యింక వీసాకు, పాస్‌పోర్టుకు బయలుదేరుతారు. యిరాన్, యిరాక్, అమెరికా, స్విట్జర్‌లాండ్, గల్ఫ్ దేశాలకు పోవాలి.

## భారతదేశములో లేనిది మరొక దేశములో లేదు

విద్యార్థులారా! చక్కగా గుర్తించుకోండి. 'ఎన్న భారతే తన్న భారత'. భారతదేశములో లేనిది మరొక దేశములోలేదు. సర్వమునకు భారతదేశమే ఒక గురువు వంటిది. అలాంటి భారతదేశమునకు అనేకమంది వచ్చిపోతున్నారు. భారతదేశము ఎంత కర్మభూమి, ఎంత పుణ్యభూమి, ఎంత త్యాగభూమి, ఎంత యోగభూమి! ఇక్కడ మీరు ఏ కొద్దిగా సంపాయించినా శాంతిగా జీవించవచ్చు.

**గొప్పచదువుగల్గి చిన్న గుణంబున్న**
**ఫలమదేమి వానిగుణమదేమి**
**పంటపండనిభూమి పదివేకరములేల**
**కొంచెమైన చాలు మంచిభూమి.**

కొంచమైన ఉంటే చాలు. ఈ విదేశప్రయాణములోపల ఎంతో కాలమును, కర్మను, కాయమును ఖర్చు పెట్టేస్తున్నాము. తినేది భారతధేశము తిండి, త్రాగేది భారతదేశము నీరు, జీవించేది భారతభూమిపైన. పుట్టింది భారతభూమి. పేరు భారతీయుడు. యిన్ని పెట్టుకొని ఈ భారతదేశము వదలుకొని ఏదేశముకో పోయి ఏమి సంపాయించి వస్తున్నారు? దురాశలు మానండి. మాతృభూమిలో మీరు సేవలు చేయండి. ఈ పవిత్రమైన భారతదేశములో దిక్కులేనివారు, దీనులు ఉంటున్నారు. వారి సేవలు చేయండి. స్వార్థముతోబాటు పరార్థమును గుర్తించండి. సమాజ సంక్షేమమును దృష్టియందుంచుకొని

sri sathyasai vachanamrutam

చదువును ప్రారంభించాలి. ఏదో పెద్ద పెద్ద డిగ్రీలుతీసుకుందామనుకుంటే దానివల్ల ఫలితము ఏమీలేదు. బయటదేశములకు పోతున్నారు. ఉద్యోగాలు చిక్కకపోతే హోటల్సులో కప్పులు కడిగే పనిలో చేరిపోతున్నారు. అక్కడ కప్పులు కడిగినా, వీధులు చిమ్మినా ఎవ్వరు ఏమీ చూచేవారు లేరు. మన యింట్లో మనం తిన్న టిఫిన్ ప్లేట్లు కడగటానికి మనం సిగ్గుపడుతున్నాం. ఎందుకు సిగ్గు? మనం తిన్న ప్లేట్లు మనం కడుగుకోటంలో సిగ్గు ఏమిటి? ఈ విధమైన ఆడంబరాలకు పోవటంచేత మన భారతదేశ పవిత్రతను మనమే క్షీణింపచేస్తున్నాము.

**ఈనాడు ఆకారమానవులేగాని ఆచారమానవులు కనిపించటంలేదు**

**విద్యార్థులారా!**

> **ఇది నాదు మాతృదేశము**
> **ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
> **చెదగొట్టి నుడువనేరక**
> **బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!**

దేహాభిమానము ఎంత ప్రధానమో దేశాభిమానముకూడ అంత ఉండాలి. అయితే మనదేశంకదాయని పరదేశమును హాస్యాస్పదముగా చూడటం కానీ, దూషణలకు గానీ మనం పోకూడదు. 'లోకా స్సమస్తా సుఖినో భవంతు'. అందరూ క్షేమముగా ఉంటుండాలి. శ్రీరాముడు చెప్పాడు. రావణుని సంహరించిన తరువాత విభీషణునికి పట్టాభిషేకము చేయ ప్రయత్నించినప్పుడు సుగ్రీవుడు జాంబవంతుడు, అంగదుడు అందరు చేరి 'రామా! యింక రావణుడు పోయాడు. ఈ బంగారు పట్టణమునకు తమరే పట్టము కట్టుకుంటే మంచిది కదా' అన్నారు. కడపటికి లక్ష్మణుడుకూడా చెప్పాడు: 'మనం యింక అయోధ్యకు పోయినా భరతుడు రాజ్యమేలుతున్నాడు. మనము రాజులము కాము. కనుక, ఇక్కడే ఉండి లంకను పవిత్రముగావించు'. అప్పుడు చెప్పాడు, రాముడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి. నా తల్లి కురూపిగా ఉందని, నా తల్లి అందముగా లేదని ఎవరో అందంగా, బలముగా ఉంటున్నాదని ఆమె నీ తల్లి అని పిల్చటం వీలవుతుందా? కురూపి అయినా నా

srisathyasaivachanamrutam

తల్లి నా తల్లే!' అలాంటి విశ్వాసము ఈనాటి విద్యార్థులు పెంపొందించుకోవాలి. మన మాతృభూమి అయిన ఈ భూమికి తగిన గౌరవమునందించాలి. ఈ దేశమునకు తగిన గౌరవము మనము అందించాలి. ఆనాడు కాలడిలో పుట్టిన శంకరులవారివలన ఈనాటికి కేరళరాజ్యమునకు ఎంతో గొప్ప కీర్తి వస్తూంది. మంచితనము ఎక్కడో అక్కడే అన్ని విధాల కీర్తిప్రతిష్ఠలు వస్తుంటాయి. ఈ goodness is Godness. Goodness లేకపోతే Godless అయిపోతుంది. మొట్టమొదట మనము. మనమే దైవము. దైవముకంటె గొప్పది మరొకటిలేదు. మనలోనున్న ప్రేమయే దైవగుణము. యిదే మానవతా విలువ. యిలాంటి మానవతా విలువను మనం అభివృద్ధి గావించుకోవాలి. దయ, ప్రేమ, సహనము, సానుభూతి, క్షమ యిత్యాది సద్గుణములను మనం అభివృద్ధిపరచినప్పుడు అప్పుడే మనం మానవులనిపించుకుంటాం. మానవుడుగా కనిపిస్తున్నాడుగానీ మానవతా గుణములు కనిపించటంలేదు. ఆకారమానవుడు గానీ ఆచారమానవుడు కాదని స్పష్టముగా చెప్పవచ్చును.

**దైవమునకు సమీపంగా ఉన్నప్పుడే జీవిత రహస్యము చక్కగా అర్థమవుతుంది**

విద్యార్థులారా! శంకరులవారు 16 సంవత్సరముల చిన్న వయస్సులోనే సాధించిన ఘనకీర్తి యుగయుగములందు తరతరములందు మాసిపోని మాణిక్యమువలె ప్రకాశిస్తున్నది. అదే విధముగా ప్రతి విద్యార్థి ఆదర్శవంతమైన విద్యార్థిగా తయారుకావాలి. తల్లితండ్రులకు తగిన ఆనందము నందించాలి. సమాజమునకు తగిన పేరు తెప్పించాలి. దేశమునకు తగిన కీర్తి తెచ్చిపెట్టాలి. మానవత్వమును సార్థకంగావించుకోవాలి. శంకరులవారి ప్రబోధలు విద్యార్థులకు బోధించే సమయంలో కొంత నేను సందేహిస్తున్నాను. మీరు వేరే అనుకోకూడదు. ఈ భజగోవిందములో పిల్లలకు విరక్తి కలిగే విధముగా ప్రబోధలు చేస్తున్నాడే సాయిబాబాయని ఎవరైనా ఏమైనా అనుకోవచ్చును. ఎవరేమి అనుకున్నా నాకు భయంలేదు. సత్యమునకు భయమెందుకు? అంత సులభంగా విరక్తి లభిస్తుందా? అసంభవము. సంవత్సరాలకొలది వింటున్నవారికే కించిత్తైనా మార్పులేదు. అలాంటిది ఒక్కతూరి వింటేనే మార్పు కలుగుతుందా? ఏ గొప్ప

srisathyasaivachanamrutam

అదృష్టవంతులకో అలాంటి మార్పు సంభవిస్తుంది. నిజముగా స్వతసిద్ధముగా ఆ వైరాగ్యమే ప్రాప్తిస్తే అంతకంటె మహాభాగ్యము ఏమిటున్నాది? అందువల్లనే 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః'. త్యాగము మనలో ఉన్నప్పుడే క్షేమమనే ఆరోగ్యము మనకు అందిస్తుంది. త్యాగము అంటే ఏమిటి? త్యాగము మన క్షేమమునే కోరుతుంది. మనం గాలి పీల్చుకుంటున్నాం. పీల్చుకున్న గాలిని మరొక క్షణంలో విడచకపోతే మన ఊపిరితిత్తులు పాడైపోతాయి. అక్కడ మనము త్యాగము చేస్తున్నామా, లేదా? మనం ఆహారము తీసుకుంటున్నాము. తీసుకున్న ఆహారము మరొక మార్గములో బయటకు పంపకపోతే కడుపు పాడైపోతుంది. అదే విధముగా శరీరములో రక్తముంటున్నాది. ఆ రక్తము దేహమంతా సంచరిస్తూ రావాలి. అట్లుకాకుండా ఒక చోట నిల్చిపోతే అక్కడ పుండు ఏర్పడుతుంది. అందువల్లనే దుడ్డు, బిడ్డ ఎల్లప్పుడు సంచరిస్తుండాలి. త్యాగమునకు ఎవరు అర్హులౌతారో వారు నిజంగా గొప్ప అదృష్టవంతులు. దైవానికి దూరముగానుండినంతవరకు దైవతత్వము వారికి అర్థముకాదు. దైవానికి సమీపంగా పోయినప్పుడే జీవితముయొక్క రహస్యము మనకు చక్కగా అర్థమైపోతూ వస్తుంది. వారికి తెలియకుండానే వైరాగ్యము పండిపోతుంది. ఈ వైరాగ్యము పండటమేకాదు, మనసు నిండిపోతుంది. జీవితమే సార్థకమైపోతుంది. అందువల్లనే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' రెండూ ఒక్కటైపోతాయి. కనుక, మీరందరు మంచి బుద్ధులు కల్గి, త్యాగబుద్ధులు కల్గి వ్యాసుడు వ్రాసిన ప్రకారము పదునెనిమిది పురాణముల సారము 'పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం' Help ever, hurt never ఈ రెండింటిని మీరు ఆచరణలో పెడితే అదే గొప్ప వేదాంతము.

**(తేదీ 07-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam